

**నిర్వీర్యమవుతున్న విద్యావ్యవస్థ**

పాలకుల తీరుతో విద్యావ్యవస్థ నిర్వీర్యం అవుతోందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విమర్శించారు. 12లో



**.. ఒక్క అవకాశం ఇవ్వండి**

ప్రజలు బీజేపీకి ఒక్క అవకాశమిస్తే అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని అసోం, ఒడిశా ఎమ్మెల్యేలు రామకృష్ణ, లలితేందర్ తెలిపారు. 10లో

గరిష్టం / కనిష్టం
33° / 24°

**వాతావరణం**

జిల్లాలోని కొన్నిచోట్ల బుధవారం వర్షం కురిసే అవకాశముంది. మిగతా ప్రాంతాల్లో సాధారణ ఉష్ణోగ్రతలు ఉంటాయి.

## న్యూస్‌రీల్

### సీఎంను కలిసిన ఎమ్మెల్యే సండ్ర



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే

**సత్తుపల్లి:** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సత్తుపల్లి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా తనను ప్రకటించడంపై ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా హైదరాబాద్ ప్రగతి భవన్‌లో మంగళవారం ముఖ్యమంత్రిని కలిసిన ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు.

### నేడు ఖమ్మంకు ఎంపీ కృష్ణయ్య

**ఖమ్మం మామిళ్లగూడెం:** రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు ఆర్.కృష్ణయ్య బుధవారం ఖమ్మం రానున్నారు. ఈసందర్భంగా లకారం ట్యాంక్‌బండ్ సమీపాన ఏర్పాటుచేసిన సంఘం జిల్లా కార్యాలయాన్ని ఆయన ప్రారంభిస్తారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరావు, వద్దిరాజు రవిచంద్ర పాల్గొంటారని సంఘంజిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ తెలిపారు.

### 58 మందికి సదరమ్ సర్టిఫికెట్లు




క్యాంపునకు వస్తున్న దివ్యాంగురాలు

**ఖమ్మం వైద్యవిభాగం:** జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన సదరమ్ శిబిరానికి పలువురు దివ్యాంగులు హాజరయ్యారు. మొత్తం 139 మంది స్లాట్ బుక్ చేసుకోగా 100 మంది పాల్గొన్నారు. వీరికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు 58 మందిని సర్టిఫికెట్లకు అర్హులుగా గుర్తించారు.

### బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**ఖమ్మంగాంధీచౌక్:** సాహసాన్ని ప్రదర్శించిన బాలలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి టి.సుమ సూచించారు. నూతన ఆవిష్కరణలు చేయడంతో పాటు అసాధారణ ప్రతిభాపాటవాలు కలిగి ఆటలు, కళలు, సాహిత్యం, సామాజిక సేవల్లో పాల్గొంటున్న వారే కాక ధైర్య సాహసాలు ప్రదర్శించిన వారికి బాలశక్తి పురస్కార్, బాల కళ్యాణ్ పురస్కార్ అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. 18 ఏళ్ల లోపు బాలబాలికలు https://award.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకుని, సమాచారాన్ని తమ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

### బెంగళూరుకు 'గరుడ ప్లస్'



**ఖమ్మంమామిళ్లగూడెం:** ఖమ్మం నుంచి బెంగళూరుకు గరుడ ప్లస్ ఏసీ బస్సులు నడిపిస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న తెలిపారు. ఖమ్మం, సూర్యాపేట, హైదరాబాద్, హయత్‌నగర్, వనస్థలిపురం, ఎల్బీ నగర్, దిల్‌షుక్‌నగర్, ఎంజీబీఎస్, అఫ్జల్‌గంజ్, ఆరంఘర్‌లలో పికప్ పాయింట్లు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే, బెంగళూరులో యలహంక, ఎస్టీఎం మాల్, హెబ్బల్, కెంపెగౌడ, మార్తహళ్లి వరకు బస్సు వెళ్తుందని తెలిపారు. డైనమిక్ చార్జీతో నడిపించే ఈ సర్వీసులకు రద్దీ లేని సమయంలో అతి తక్కువ చార్జీ అమలవుతుందని చెప్పారు. కాగా, ఖమ్మం నుంచి ప్రతిరోజు మధ్యాహ్నం 3.30గంటలకు మొదలయ్యే బస్సు(సర్వీస్ 8665) రాత్రి ఎనిమిది గంటలకు హైదరాబాద్ చేరుకుని బెంగళూరు వెళ్తుందని, సాయంత్రం 4.30గంటలకు మొదలయ్యే బస్సు(సర్వీస్ 8655) రాత్రి 9.30గంటలకు హైదరాబాద్ చేరుకుంటుందని ఆర్ఎం తెలిపారు. అలాగే, తిరుగు ప్రయాణంలో బెంగళూరులో సాయంత్రం ఐదు గంటలకు(సర్వీస్ 8656), రాత్రి 7.45 గంటలకు(సర్వీస్ 8666) గరుడ ప్లస్ బస్సులు ప్రారంభమవుతాయని తెలిపారు.

# తుమ్మల.. దారెటు?



**ఉమ్మడి జిల్లా రాజకీయాలను** గతంలో శాసించిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దారి ఎటు అన్నది ఆయన అనుచరులు, రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ కలిగిస్తోంది. చివరి వరకు పాలేరు టికెట్ తనదేనని ధీమా వ్యక్తం చేసిన ఆయనకు గులాబీ బాస్, సీఎం కేసీఆర్ షాక్ ఇచ్చారు. సిట్టింగ్ ఎమ్మెల్యేకే టికెట్ కట్టబెట్టడంతో తుమ్మల అనుచర గణం బీఆర్‌ఎస్‌పై ఆగ్రహంతో ఊగిపోతోంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల అనుచరులు ఖమ్మం రూరల్ మండలంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సమావేశమయ్యారు. బీఆర్‌ఎస్‌కి తగ్గిన బుద్ధి చెప్పాలంటే తుమ్మల కాంగ్రెస్‌లోకి వెళ్లాల్సిందేనంటూ ముక్త కంఠంతో ఆయనకు సూచించారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



ఖమ్మం రూరల్ మండలంలో సమావేశమైన తుమ్మల అనుచరులు

**పాలేరు టికెట్ ఇవ్వకపోవడంపై అనుచరుల ఆగ్రహం**

- ఆయన కాంగ్రెస్‌లోకి వెళ్లాలని ముఖ్య నేతల సూచన
- రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటారని ప్రచారం
- రాజధానిలో తుమ్మల ఇంటికి వెళ్లిన వద్దిరాజు, తాతా, సండ్ర

**శాసించి.. ఆశించి..**

ఉమ్మడి జిల్లా రాజకీయ చరిత్రలో తుమ్మలకు ప్రత్యేక స్థానం ఉంది. సుదీర్ఘ కాలం టీడీపీలో కొనసాగిన ఆయన ఎక్కువ కాలం ఉమ్మడి జిల్లా మంత్రిగా పనిచేసిన వారిలో ప్రథమ స్థానంలో నిలుస్తారు. టీడీపీ హయాంలో ఎన్టీ రామారావు, చంద్రబాబునాయడు పాలనలో మంత్రిగా కొనసాగారు. సత్తుపల్లిలో మొదలైన ఆయన రాజకీయ ప్రస్థానం నియోజకవర్గాల పునర్విభజనతో ఖమ్మం, పాలేరుకు చేరింది. పాలేరు ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున విజయం సాధించిన ఆయన 2018లో అదే పార్టీ టికెట్‌తో పోటీ చేసి కందాల చేతిలో ఓటమి పాలయ్యారు. ఆతర్వాత కందాల బీఆర్‌ఎస్‌లో చేరడంతో పాలేరు నుంచే బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేయాలనుకున్న తుమ్మల రాజకీయ భవితవ్యంపై నీలి నీడలు అలుముకుంటూ వచ్చాయి. టీడీపీలో ఉన్న సమయాన ముఖ్య అనుచరులకు తానే టికెట్లు ఇప్పించి గెలిపించుకున్న సందర్భాలున్నాయి. అలా ఒకప్పుడు ఉమ్మడి జిల్లా రాజకీయాలను శాసించిన ఆయనకు తాజాగా బీఆర్‌ఎస్ టికెట్ నిరాకరించడం ఘోర పరాభవమేనని అనుచర గణంలో చర్చ జరుగుతోంది. చివరివరకు ముఖ్యమంత్రి కేసీఆర్‌పై నమ్మకం పెట్టినా రిక్త హస్తమే ఎదురుకావడాన్ని అనుచర గణం జీర్ణించుకోలేకపోతోంది. వరుస సార్వత్రిక ఎన్నికల్లో తుమ్మల ఏదో ఒక చోట పోటీ చేసి తన రాజకీయ ప్రాబల్యాన్ని నిలుపుకుంటూ వస్తుండగా.. పార్టీపరంగా టికెట్ ఆశించి భంగపడడం ఇదే తొలిసారి.

**కాంగ్రెస్‌లోకి వెళ్లాల్సిందే..**

పాలేరు టికెట్ తుమ్మలకు దక్కకపోవడంతో ఆయన అనుచరగణం విస్తుపోయింది. దీంతో నాలుగు మండలాల అనుచరులు మంగళవారం సమావేశమయ్యారు. అనుచర నేతలు జొన్నలగడ్డ రవి, శాఖమూరి రమేష్, మద్ది మల్లారెడ్డి, బండి జగదీష్, సీతారాం తదితరులు పాల్గొనగా... తుమ్మలను బీఆర్‌ఎస్ అవమానించినందున కాంగ్రెస్‌లోకి వెళ్లాలని ముక్తకంఠంతో అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్‌లోకి వెళ్లి పాలేరు నుంచే పోటీ చేసేలా తుమ్మలను ఒప్పించాలని నిర్ణయం తీసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా ఆయనకు ఫోన్ చేసి చెప్పగా... రెండు, మూడు రోజుల్లో జిల్లాకు రాగానే చర్చించుకుందామని వారికి చెప్పినట్లు తెలిసింది. తుమ్మల వచ్చాక గండుగులపల్లిలోని నివాసంలో పాలేరు నియోజకవర్గం, ఉమ్మడి జిల్లా అనుచరులతో సమావేశం కానున్నట్లు తెలిసింది.

**సర్దిచెప్పిన జిల్లా నేతలు**

టికెట్ దక్కకపోవడంతో తీవ్ర ఆవేదనలో ఉన్న తుమ్మలను రాజధానిలోని ఆయన నివాసంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ కలిశారు. చాలాసేపు మౌనం వహించిన ఆయన టికెట్ ఇవ్వకుండా తనను అవమానించారని అన్నట్లు తెలిసింది. అన్నీ సర్దుకుంటాయని, త్వరలో మంచి అవకాశం వస్తుందని వారు చెప్పగా... చివరగా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలనే నిర్ణయాన్ని పక్కన పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించినట్లు సమాచారం. అయితే, మూడు, నాలుగు రోజుల ముందు మంత్రి హరీశ్‌రావు కూడా నాగేశ్వరరావును కలిసి టికెట్ రావట్లేదని చెప్పడమే కాక భవిష్యత్‌లో మంచి అవకాశం ఇవ్వనున్నందున ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని కోరినట్లు తెలిసింది.

**అంతా ఉత్కంఠ..**

ఓ వైపు అనుచరులు కాంగ్రెస్‌లోకి వెళ్లాలని సూచిస్తుండడం.. మరోవైపు బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్యనేతలు సీఎం కేసీఆర్ ఆదేశాలతోనే తుమ్మలను కలిసిన నేపథ్యాన ఆయన రాజకీయ పయనం ఎటు అన్నది ఉమ్మడి జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. ఇటీవల ఖమ్మంలో జరిగిన బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాజీ మంత్రి నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి సభను విజయవంతం చేసేందుకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పర్యటించాలని కేసీఆర్ అన్న మాటలను ఆయనతో చెప్పారు. అలాగే, సభలోనూ సీఎం కేసీఆర్ తుమ్మల పేరు ప్రస్తావించడంతో అనుచర గణం పాలేరు టికెట్ తమకేనని భావించారు. కానీ ఇప్పుడు అందుకు విరుద్ధంగా నిర్ణయం వెలువడడంతో అనుచరులు మండిపడుతుండగా.. తుమ్మల కార్యకర్తల అభిప్రాయం మేరకు నడుస్తారా, అధిష్టానం బుజ్జగింపులకు తలొగ్గి పార్టీలోనే కొనసాగుతారా అన్నది వేచి చూడాల్సిందే.

# ప్రత్యర్థి ఎవరైనా విజయం మనదే..



మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్, పక్కన నీరజ, ప్రజాప్రతినిధులు, నాయకులు

- ఆ దిశగా పార్టీ శ్రేణులు కృషి చేయాలి
- బీఆర్‌ఎస్ సంక్షేమాన్ని గడపగడపకూ తీసుకెళ్లండి
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ

**ఖమ్మంమయూరిసెంటర్:** ప్రత్యర్థి ఎవరైనా సరే.. విజయం మనదే.. ఆ దిశగా పార్టీ శ్రేణులు బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను గడపగడపకు వివరించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. ఖమ్మం వీడీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి కేసీఆర్, క్షేత్రస్థాయిలో తాను చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలిపారు. నామినేషన్ వేసే వరకు ఆగకుండా, అప్పటికే ఒక్కో ఇంటికి మూడు సార్లు వెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ప్రత్యర్థి పార్టీలు అభ్యర్థులను ప్రకటించేలోగా లభించిన సమయాన్ని సద్వినియోగం చేసుకుందామని తెలిపారు. ఖమ్మం నియోజకవర్గం రూపంలో తనకు పెద్ద కుటుంబం లభించిందని చెప్పారు. ఇటీవల పార్టీ నుంచి వెళ్లిన నాయకులు ఖమ్మం నుంచి పెద్ద సంఖ్యలో వలసలు ఉంటాయని చెప్పినా.. ఏ ఒక్కరూ వెళ్లకపోవడమే నాయకులు, కార్యకర్తల గొప్పతనమని, వారి నిజాయితీకి కృతజ్ఞతలు చెబుతున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో అభ్యర్థులను ప్రకటిస్తుంటే తాను మాత్రం కేడర్‌తో సంతోషాన్ని పంచుకోవాలని ఖమ్మంలోనే ఉన్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తన గెలుపుతోపాటు ఖమ్మం జిల్లాలోని ఇతర అభ్యర్థుల గెలుపునకు కూడా తాను పనిచేయాల్సి ఉందని వివరించారు. ఈమేరకు ఖమ్మంలో తన గెలుపు కోసం అంతా కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కాగా, మరోమారు టికెట్ కేటాయించిన పార్టీ అధినేత, సీఎం కేసీఆర్, వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీశ్‌రావుకు పువ్వాడ కృతజ్ఞతలు తెలిపారు.

**అభినందనల వెల్లువ**

ఖమ్మం నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు టికెట్ ఖరారు కావడంపై ప్రజాప్రజాప్రతినిధులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సమావేశానికి హాజరైన పలువురు మంత్రిని సన్మానించారు. పువ్వాడ గెలుపుతోనే ఖమ్మం నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని చెబుతూ, ఆయన విజయానికి సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, జెడ్పీటీసీ ప్రియాంక, నాయకులు గుండాల కృష్ణ, వీరూనాయక్, కర్నాటి కృష్ణ, ఫాతిమా జోహరా, అశ్రిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కుల ధ్రువీకరణపత్రం రద్దు

- ఎన్నికల వేళ దయానంద్‌కు షాక్
- నిర్ణయం వెలువరించిన కలెక్టర్
- రాజకీయ దురుద్దేశమేనంటూ మట్టా ఆగ్రహం



మట్టా దయానంద్

**సాక్షిప్రతినిధి, ఖమ్మం:** సత్తుపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్‌కు గట్టి షాక్ తగిలింది. గతంలో వివిధ సందర్భాల్లో ఆయన పొందిన ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేస్తూ కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఈనెల 17న ఉత్తర్వులు వెలువరించారు. దయానంద్ ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం తీసుకోవడాన్ని సవాల్ చేస్తూ ములుగు జిల్లా(పాత ఉమ్మడి ఖమ్మం) వెంకటాపురం గ్రామానికి చెందిన కొడారి వినాయకరావు ఫిర్యాదు చేశారు. తప్పుడు మార్గంలో ఆయన ధ్రువీకరణ పొంది రాజ్యాంగ పదవుల కోసం పోటీ పడ్డారని, ఎస్సీలకు దక్కాల్సిన హక్కును పొందారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో అధికారులు విచారణ చేపట్టగా.. ఆధారాలు సమర్పించాలనే ఆదేశాల మేరకు ఆయన ఎస్సీ(మాల)గా నిరూపించుకోవడంలో విఫలమయ్యారని సత్తుపల్లి తహసీల్దార్ నివేదిక సమర్పించారు. దీనికి తోడు కులాంతర వివాహం చేసుకున్న వారి పిల్లలు ఏ కులాన్ని పొందుతారనే అంశంపై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులకు లోబడి దయానంద్ ఎస్సీ కుల ధ్రువీకరణ పొందడం, రిజర్వేషన్ హక్కు దక్కించుకునేందుకు అర్హుడు కాదని కలెక్టర్ గౌతమ్ జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొన్నారు.

**ఇదీ నేపథ్యం..**

మట్టా దయానంద్ విజయకుమార్ తల్లిదండ్రులు ఆరోగ్యం(ఎస్సీ–మాల), కృష్ణమూర్తి(బీసీబీ – గౌడ) కులాంతర వివాహం చేసుకున్నారు. తల్లి కులాన్ని ప్రాతిపదికగా తీసుకుని దయానంద్ కుల ధ్రువీకరణ పత్రం తీసుకుని, 2014 ఎన్నికల్లో సత్తుపల్లి నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య చేతిలో స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. అనంతరం పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు బీఆర్‌ఎస్‌లో చేరగా, 2018లో బీఆర్‌ఎస్ అధిష్టానం టికెట్ నిరాకరించింది. అయినా పార్టీలోనే కొనసాగిన ఆయన వచ్చే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పొంగులేటి కన్నా ముందే కాంగ్రెస్‌లో చేరారు. సత్తుపల్లి నుంచి పోటీకి సిద్ధమవుతున్న తరుణాన కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేయడం గమనార్హం.

**రాజకీయ దురుద్దేశంతోనే చేశారు..**

ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాన్ని రాజకీయ దురుద్దేశంతో రద్దు చేశారని మట్టా దయానంద్ వెల్లడించారు. ఈ అంశంపై హైకోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపారు. కులాంతర వివాహాలకు సంబంధించి వారి పిల్లల సర్టిఫికెట్ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పులను కలెక్టర్ పరిగణనలోకి తీసుకోలేదని చెప్పారు. గత మూడేళ్లుగా ఈ అంశం కొనసాగుతుండగా ఇప్పుడు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇలా వ్యవహరించారని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారు విచారణకు రాకున్నా తన అభిప్రాయం తీసుకోకుండానే కలెక్టర్ ఏకపక్షంగా నిర్ణయం వెలువరించారని పేర్కొన్నారు.

# అర్హులంతా ఓటింగ్‌లో పాల్గొనాలి

- అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్
- వయోవృద్ధులకు అవగాహన, సందేహాల నివృత్తి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, పక్కన అధికారులు

**ఖమ్మం సహకారనగర్:** ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం పోలింగ్ ప్రక్రియ, కేంద్రాల్లో ప్రత్యేక సదుపాయాల కల్పనపై వయోవృద్ధులకు అవగాహన కల్పించారు. జిల్లా స్వీప్ నోడల్ అధికారి కె.శ్రీరామ్‌తో కలిసి అదనపు కలెక్టర్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరును ప్రయోగాత్మకంగా వివరించి సందేహాలు నివృత్తి చేశారు. అనంతరం మధుసూదన్ మాట్లాడుతూ చైతన్యవంతులైన వయోవృద్ధులు ఓటు వేయడమే కాక ఇతరులకు అవగాహన కల్పించాలని కోరారు. 80ఏళ్లు దాటిన వయోవృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుండే ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు కల్పించిన నేపథ్యాన ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాళ్లబండి రాంబాబు, జిల్లా సంక్షేమ అధికారి సుమ, రిటైర్డ్ ఉద్యోగ సంఘాల బాధ్యులు డాక్టర్ చంద్రమోహన్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు

**సరుకులు సకాలంలో అందించాలి**

రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు సకాలంలో సరుకులు అందించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ సూచించారు. జిల్లా కేంద్రంలోని పలు రేషన్ దుకాణాలను తనిఖీ చేసిన ఆయన స్టాక్ రిజిస్టర్లు, బయోమెట్రిక్ ఈ–పాస్ యంత్రాలను పరిశీలించి డీలర్లకు సూచనలు చేశారు. డీటీ సురేందర్, అధికారులు పాల్గొన్నారు.

**సమయపాలన పాటించాలి**

వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు సమయపాలన పాటించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పలు విభాగాలను ఆయన తనిఖీ చేశారు. కలెక్టరేట్ సిబ్బంది, రికార్డ్ రూమ్, భూసేకరణ విభాగం, దేవాదాయ, ఖజానా, వ్యవసాయ శాఖల కార్యాలయాల తనిఖీలు చేసి ఉద్యోగులు హాజరును పరిశీలించారు. సెలవు కోసం ముందస్తు అనుమతి తీసుకోవాలని, అలా కాకుండా గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


# రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలు

- అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్‌గా రవీంద్రబాబు

**ఖమ్మంమయూరిసెంటర్:** ఎన్నో ఏళ్లుగా స్థానచలనం లేకుండా ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలోని సబ్ రిజిస్ట్రార్ల బదిలీలు ఎట్టకేలకు జరిగాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలువురు సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్–1 అడపా రవీంద్రబాబును జిల్లా అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. ప్రస్తుతం అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న గంగవరపు నరేంద్రను ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. అలాగే, ఖమ్మం ఎంవీ అండ్ ఆడిట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎం.పద్మను ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్–1గా, ఖమ్మంరూరల్ సబ్ రిజిస్ట్రార్ టి.సుజన్‌కుమార్‌ను ఎంవీ అండ్ ఆడిట్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. అలాగే, మధిర సబ్ రిజిస్ట్రార్ ఎస్.రామకిషోర్‌రెడ్డిని నర్సంపేట సబ్‌రిజిస్ట్రార్‌గా, భద్రాచలం సబ్‌రిజిస్ట్రార్ ఏ.గిరిధర్‌ను మధిర సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. అయితే, భద్రాచలం సబ్ రిజిస్ట్రార్‌గా మాత్రం ఎవరినీ నియమించలేదు.

# శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

- ఆ దిశగా సిబ్బంది కృషి చేయాలి
- కల్లూరు, తల్లాడ పీఎస్‌ల్లో తనిఖీ చేసిన సీపీ విష్ణు ఎస్.వారియర్



కల్లూరు పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సీసీ వారియర్

**కల్లూరు/తల్లాడ:** శాంతిభద్రతల పరిరక్షణ, నేరరహిత సమాజం స్థాపనే లక్ష్యంగా పోలీసులు కృషి చేయాలని పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ ఆదేశించారు. జిల్లాలోని కల్లూరు, తల్లాడ పోలీసు స్టేషన్లను సీపీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణ, ఉద్యోగుల పనితీరు, పెండింగ్ కేసులు, విచారణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. దర్యాప్తు, చార్జీషీట్ల దాఖలులో అలసత్వం వహించొద్దని సూచించారు. పాత నేరస్తుల కదలికలను ఎప్పటికప్పుడు గుర్తించాలని చెప్పారు. తరచుగా సమస్యాత్మక ప్రాంతాల్లో తనిఖీలు చేయాలని, రాత్రివేళ పెట్రోలింగ్ పెంచాలని సీపీ ఆదేశించారు. అంతేకాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకునేలా ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కాగా, కల్లూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన భవనాన్ని సీపీ పరిశీలించారు. ఈతనిఖీల్లో కల్లూరు, వైరా ఏసీపీలు రామానుజం, రెహమన్, సీఐ హనోక్, ఎస్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీలో బోణీ!

- రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు విద్యార్థుల ప్రవేశం
- వచ్చేనెల 1న ప్రారంభించనున్న సీఎం



భరత్ పారిక్‌కు అడ్మిషన్ కాపీ అందిస్తున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు

**ఖమ్మం వైద్యవిభాగం:** ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రవేశాలు మొదలయ్యాయి. రాజస్థాన్‌కు చెందిన భరత్ పారిక్ మంగళవారం తొలి అడ్మిషన్ పొందగా ఆయనకు ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు అడ్మిషన్ కాపీ అందజేశారు. నీట్ జాతీయ స్థాయిలో 21,875 ర్యాంకు సాధించిన పారిక్ నేషనల్ కోటాలో సీటు పొందారు. అలాగే రాజస్థాన్‌కే చెందిన విద్యార్థిని కూడా గరీమా గౌతమ్(21,728 ర్యాంక్) కూడా ప్రవేశం పొందింది. గత నెల నుండి నీట్ కౌన్సెలింగ్ ప్రారంభించగా ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఆప్షన్లు పెట్టుకుంటున్నారు. ఇందులో భాగంగా మంగళవారం నలుగురు విద్యార్థులు రాగా ఇద్దరు ప్రవేశాలు పొందారు. ఖమ్మం మెడికల్ కాలేజీకి 100 ఎంబీబీఎస్ సీట్లు కేటాయించగా అందులో 15 సీట్లు జాతీయ స్థాయిలో, మిగతా 85 సీట్లు రాష్ట్ర స్థాయి కోటాకు కేటాయించారు.

**సిద్ధమైన తరగతి గదులు, వసతి భవనాలు**

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకొక మెడికల్ కళాశాల ఉండాలనే ఉద్దేశంతో గత ఏడాది ఖమ్మంకు కళాశాలను మంజూరు చేసిన విషయం విదితమే. రూ.166 కోట్లు కేటాయించగా ఖమ్మం ఆస్పత్రి, ఆర్‌అండ్‌బీ, పాత కలెక్టరేట్, డీఎంహెచ్‌ఓ కార్యాలయంతో కలుపుకొని 30 ఎకరాల స్థలం సమకూర్చారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధులు పలుమార్లు పరిశీలించి అనుమతులు జారీ చేయడంతో ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతానికి పాత కలెక్టరేట్‌లో కళాశాల తరగతి గదులు, ల్యాబ్‌లు, ఆడిటోరియం, సిబ్బంది గదులే కాక ఆర్‌అండ్‌బీ భవనంలో బాలికలకు, పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో బాలురకు హాస్టళ్లు సిద్ధం చేశారు. వారం, పది రోజుల్లో పూర్తి స్థాయిలో విద్యార్థులు చేరుతారని కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు చెప్పారు. కాగా, కళాశాలను వర్చువల్‌గా సీఎం కేసీఆర్ వచ్చేనెల 1వ తేదీన ప్రారంభించే అవకాశం ఉంది. పూర్తి స్థాయిలో సీట్లు భర్తీ అయ్యాక అక్టోబర్ మొదటి వారంలో తరగతులు మొదలవుతాయి. ఇప్పటికే ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మినిస్టీరియల్ సిబ్బందిని నియమించారు.

## క్లుప్తంగా

### బీజేపీ పార్లమెంట్ కన్వీనర్‌గా 'నంబూరి'


రామలింగేశ్వరరావు

ఖమ్మంమామిళ్లగూడెం: బీజేపీ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్‌గా నంబూరి రామలింగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనతోపాటు జాయింట్ కన్వీనర్‌గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పి.నిరంజన్‌రెడ్డిని నియమించారు.

### శిశుగృహలో పసికందు సంరక్షణ


శిశుగృహలో ఉన్న బాబు

ఖమ్మంగాంధీచౌక్: ఇటీవల ఖమ్మం రాపర్తినగర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లిన 40 రోజుల వయస్సు బాలుడి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించామని జిల్లా సంక్షేమాధికారి టి.సుమ తెలిపారు. ఇప్పటికే ఖమ్మంలోని శిశు గృహలో బాలుడి సంరక్షణ కొనసాగుతుందని చెప్పారు. బాబు సంబంధీకులు 30 రోజుల్లోగా తగిన ఆధారాలతో సంప్రదించాలని, లేనిపక్షంలో అనాథగా ప్రకటించి ప్రభుత్వం నిబంధనల మేరకు దత్తత ఇస్తామని తెలిపారు. కాగా, దత్తత కోసం ఆసక్తి ఉన్న వారు WWW.CARA.NIC.INలో రిజిస్టర్ చేసుకోవాలని ఆమె సూచించారు.

### సాహస బాలల అవార్డుకు దరఖాస్తులు

ఖమ్మంగాంధీచౌక్: బాలబాలికలకు సాహస అవార్డులు ఇవ్వనున్న నేపథ్యాన అక్టోబర్ 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా సంక్షేమాధికారి టి.సుమ తెలిపారు. దరఖాస్తుదారులు తాము చదువుకుంటున్న విద్యాసంస్థ అధికారి లేదా పంచాయతీ అధికారి, ఆ ప్రాంత పోలీసు అధికారి తదితరుల సిఫారసుతో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. బాలల రక్షణకు సాహసోపేతంగా కృషి చేసినట్లయితే ఘటన జరిగే నాటికి ఆరు నుంచి 18 ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. ఈమేరకు www.iccow.co.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని, కాపీని తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

### పెసర సాగుపై రైతులకు అవగాహన

తల్లాడ: మండలంలోని కుర్నవల్లిలో మంగళవారం పెసర పంట సాగుపై రైతులకు శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మధిర వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త టి.భరత్ పెసరలో వచ్చే తెగుళ్లు, నివారణపై అవగాహన కల్పించారు. పల్లాకు తెగులు నివారణకు ఎసిపేట్ 250 గ్రాములు లేదా ఎసిటామిప్రిడ్ 100 గ్రాములు ఎకరాకు, కాయతొలుచు పురుగు నివారణకు ఫ్లూబెండామైడ్ 50 మి.లీ.ను ఎకరానికి వాడాలని సూచించారు. సర్పంచ్ అయిలూరి లక్ష్మి, వెంకటయ్య, నాగేశ్వర్‌రావు తోపాటు అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

### మనస్తాపంతో ఆత్మహత్య

చింతకాని: మండలంలోని లచ్చగూడెంకు చెందిన మడిపల్లి పుల్లయ్య (45) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్లయ్య కొంత కాలంగా మద్యానికి బానిస కావటంతో కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన ఆయన సోమవారం పొలానికి వెళ్లి పురుగుల మందు తాగగా స్థానిక రైతులు గుర్తించి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందడంతో పుల్లయ్య కుమారుడు గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

### కాపర్‌వైర్ చోరీ

సత్తుపల్లి: ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టిన దుండుగులు కాపర్ వైర్ ఎత్తుకెళ్లగా పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సత్తుపల్లి శివారు రేజర్ల వెళ్లే దారిలో ఈనెల 20వ తేదీ రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా నిలిపేసిన దుండగులు పగలకొట్టి రూ.లక్ష విలువైన కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లారు. ఘటనపై ఏఈ శరత్‌బాబు చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

**మోటార్ స్టార్టర్లు...**

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురంలో విద్యుత్ మోటార్ స్టార్టర్లను చోరీ చేశారు. రైతు రావెళ్ల కృష్ణారావు పొలంలో అమర్చిన మోటార్ స్టార్టర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. గతంలోనూ చోరీ జరిగిందని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

| | గరిష్ట | కనిష్ట |
|---|---|---|
| పెసలు | 7,600 | 7,600 |
| కందులు | 8,900 | 8,900 |
| మిర్చి | 19,400 | 13,000 |
| పత్తి | 7,650 | 5,500 |

– ఖమ్మం వ్యవసాయం

### పామాయిల్ గెలలు

| | |
|---|---|
| టన్ను ధర | రూ.13,091 |

# సీతమ్మసాగర్ పూర్తవుతుందా?


సీతమ్మసాగర్ బ్యారేజీని సందర్శించిన ఎన్‌జీటీ నియమిత ద్విసభ్య కమిటీ సభ్యులు (ఫైల్)

- జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో కొనసాగుతున్న విచారణ
- పర్యావరణ అనుమతులు పొందేందుకు జలవనరుల శాఖ అధికారుల కసరత్తు

అశ్వాపురం: ఎన్జీటీ ఉత్తర్వుల మేరకు మూడు నెలలుగా నిలిచిపోయిన సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు పనులు పునఃప్రారంభమవుతాయా? అనే సందేహం సర్వత్రా నెలకొంది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని 6.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 280 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సీతమ్మసాగర్ బహుళార్థసాధక ప్రాజెక్ట్‌ను చేపట్టింది. అశ్వాపురం మండలం కుమ్మరిగూడెం గ్రామంలో గోదావరి నదిపై దుమ్ముగూడెం ఆనకట్టకు దిగువన సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మిస్తున్నారు. దీని ద్వారా 37.5 టీఎంసీల నీరు నిల్వ చేయనున్నారు. ఆరు బ్లాకులుగా బ్యారేజీని నిర్మిస్తున్నారు. ఫియర్ల నిర్మాణం కొనసాగుతున్న సమయంలో పర్యావరణ అనుమతులు లేకుండా సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ పనులు చేపడుతున్నారని దుమ్ముగూడెం మండలానికి చెందిన నిర్వాసితుడు తెల్లం నరేశ్ చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)ను ఆశ్రయించాడు. పర్యావరణ అనుమతులు లేకుండా పనులు చేపట్టవద్దని సూచిస్తూ మార్చి 23న ఎన్‌జీటీ పనులు నిలిపివేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మూడు నెలలుగా పనులు నిలిచిపోయాయి.

**కొనసాగుతున్న విచారణ..**

సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ పనులపై ఎన్‌జీటీలో ఐదునెలలుగా విచారణ కొనసాగుతోంది. ఎన్‌జీటీ ఉత్తర్వులకు విరుద్ధంగా పనులు కొనసాగిస్తున్నారని పిటిషనర్ తెల్లం నరేశ్ జూలై 12న జరిగిన విచారణలో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశాడు. రాష్ట్ర ప్రభుత్వం మధ్యంతర ఉత్తర్వులకు విరుద్ధంగా సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ పనులు కొనసాగిస్తున్నట్టు కనిపిస్తోందని జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. జూన్ 28న క్షేత్రస్థాయిలో పర్యటించిన కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, గోదావరి నది నిర్వహణ బోర్డులతో కూడిన సంయుక్త కమిటీ నివేదిక అదే విషయాన్ని స్పష్టం చేస్తోందని ఎన్‌జీటీ మండిపడింది. సంయుక్త కమిటీ నివేదిక పారదర్శకంగా లేదని ఎన్‌జీటీ స్పష్టం చేసింది. మార్చి 24 నుంచి జూన్ 28 వరకు అక్కడ ఉన్న యంత్రాలు, షట్టర్లు తొలగిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ అక్కడ పనులకు సంబంధించిన రిజిష్టర్లు పెట్టలేదని, రికార్డులు లేకుండా పనులు చేస్తున్నట్టు కనిపిస్తోందని, షట్టర్ల తొలగింపు వంటి పనులు చేపట్టాలన్నా ట్రిబ్యునల్ అనుమతి అవసరమని, అనుమతి లేకుండా పనులు కొనసాగించడం ఉత్తర్వుల ఉల్లంఘనేనని ఎన్‌జీటీ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేసింది. ఉల్లంఘనపై పర్యావరణ మంత్రిత్వ శాఖ, జీఆర్‌ఎంబీలు ఏం చర్యలు తీసుకున్నాయన్న విషయంపై నివేదిక ఇచ్చేవరకు వేచి చూస్తామని, తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు నిర్మాణాలు కొనసాగించొద్దన్న మధ్యంతర ఉత్తర్వులు కొనసాగుతాయని విచారణ ఆగస్టు 17కు వాయిదా వేసింది. ఆగస్టు 17న తిరిగి విచారించిన ఎన్‌జీటీ కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ నివేదిక కోసం వేచి చూస్తామని నివేదిక సమర్పించాక తదుపరి నిర్ణయం తీసుకుంటామని విచారణను సెప్టెంబర్ 15కు వాయిదా వేశారు. నిర్మాణాలు కొనసాగించొద్దన్న మధ్యంతర ఉత్తర్వులు కొనసాగుతాయని స్పష్టం చేసింది.

**జలవనరులశాఖ కసరత్తు..**

పర్యావరణ అనుమతులు లేవని ఎన్‌జీటీ ఉత్తర్వులు వెలువరించడంతో సీతమ్మసాగర్ బహుళార్థసాధక ప్రాజెక్ట్ పనులు నిలిచిపోయాయి. సీతారామ ఎత్తిపోతల పథకం పనులకు పర్యావరణ అనుమతులున్నాయని దీని విస్తరణలో భాగంగా సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ పనులను చేపట్టామని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర పర్యావరణ శాఖకు తెలిపింది. ఎన్‌జీటీ విచారణలోను రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది ఇదే వాదనను వినిపించారు. సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ రెండు వేర్వేరని, సీతమ్మసాగర్ ప్రాజెక్ట్‌కు విడిగా పర్యావరణ అనుమతులు పొందాలని గోదావరి బోర్డు, ఎన్‌జీటీ సూచనలతో పర్యావరణ అనుమతులు పొందేందుకు ప్రభుత్వం, జలవనరుల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జూన్ 14న సీతమ్మసాగర్ బహుళార్థసాధక ప్రాజెక్ట్‌పై అశ్వాపురంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అశ్వాపురం, మణుగూరు, చర్ల, దుమ్ముగూడెం మండలాల రైతులు, ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలు తెలిపారు. సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనాలున్నాయని, ప్రాజెక్ట్ నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని రైతులు, ప్రజలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. బ్యారేజీకి సమీపంలో ఉన్న మణుగూరు భారజల కర్మాగారానికి బ్యారేజీ నిర్మాణం వల్ల ఎలాంటి నష్టం లేదని ఎన్‌ఓసీ ఇవ్వాల్సి ఉంది. ఈ ప్రక్రియ తుది దశకు చేరుకున్నట్టు సమాచారం. అనంతరం జలవనరుల శాఖ అధికారులు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమై పర్యావరణ అనుమతులపై చర్చించి సమగ్రంగా వివరించనున్నారు. రెండు నెలల్లో పర్యావరణ అనుమతులు పొంది పనులు పునఃప్రారంభిస్తామని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

## బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వండి..

అసోం ఎమ్మెల్యే రామకృష్ణ ఘోష్


సత్తుపల్లి టౌన్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణఘోష్


నేలకొండపల్లి : జాతీయ రహదారి పనులను పరిశీలిస్తున్న మహాపాత్రో, నాయకులు

సత్తుపల్లిటౌన్: దేశ ప్రజలందరి అభివృద్ధే బీజేపీ లక్ష్యమని.. ఈ విధానాన్ని అసోంలో అమలు చేయటం వల్ల రెండోసారి అధికారంలోకి వచ్చామని.. తెలంగాణలో కూడా బీజేపీకి ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని అసోం ఎమ్మెల్యే రామకృష్ణ ఘోష్ తెలిపారు. సత్తుపల్లి రాజీవ్‌కాలనీతో మంగళవారం ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గెలుపుపై నమ్మకం లేకపోవంతోనే రెండు చోట్ల నుంచి పోటీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీజేపీకి అవకాశమిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. నాయకులు భాస్కర్ల వీరంరాజు, ఆచంటి వీరస్వామి, నాయుడు రాఘవరావు, సుదర్శన్ మిశ్రా, బాలకృష్ణారెడ్డి, పాలకొల్లు శ్రీను, రాంబాబు, నర్సింహారావు, రామారావు పాల్గొన్నారు.

**కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలి**

నేలకొండపల్లి: తెలంగాణలో అన్ని వర్గాలను ఇబ్బంది పెడుతున్న కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలని ఒడిశా రాష్ట్రంలోని బ్రహ్మగిరి ఎమ్మెల్యే లలితేందర్ విద్యాధర్ మహాపాత్రో పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని బౌద్ధక్షేత్రం, రామదాసు ధ్యాన మందిరం, శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని మంగళవారం సందర్శించిన విశేషాలను తెలుసుకున్నారు. అనంతరం ప్రాచీన ఆశా కార్యకర్తలు, బోదులబండలో ఆర్మీ జవాన్ కుటుంబాలను సన్మానించాక జాతీయ రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆతర్వత పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో విద్యాధర్ మాట్లాడుతూ తెలంగాణలో కుటుంబ, అవినీతి పాలనతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నందున.. ఈసారి తమకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ నెల 27న ఖమ్మంలో జరగనున్న అమిత్ షా సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, నాయకులు నున్నా రవికుమార్, అనంతు ఉపేందర్‌గౌడ్, విజయ, సూరేపల్లి జ్ఞానరత్నం, కోటి హనుమంతరావు, షేక్ మొహినుద్దీన్, పాగర్తి సుధాకర్, నాగచారి, మన్నె రాధాకృష్ణ, కాసాని ఉదయ్, పాలకుర్తి ధనమూర్తి, శ్రీకాంత్, బ్రహ్మం, ఉదయ్, వీరబాబు, రాము, రాజు, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

## ఎల్‌ఓసీ చెక్కు అందజేసిన ఎంపీ


ఎల్‌ఓసీ చెక్కు అందిస్తున్న ఎంపీ నామ

ఖమ్మంమయూరిసెంటర్: సీఎంఆర్‌ఎఫ్ ద్వారా పేద కుటుంబాలకు లబ్ధి జరుగుతోందని ఎంపీ నామ నాగేశ్వరరావు తెలిపారు. బోనకల్ మండలం చిన్న బీరవల్లికి చెందిన కె.ఆనందం అనారోగ్యంతో బాధపడుతుండగా చికిత్సకు డబ్బు లేక ఎంపీని ఆశ్రయించాడు. దీంతో ఆయన సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.2.50 లక్షలు మంజూరు చేయించి మంగళవారం హైదరాబాద్‌లో చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాణాల వెంకటేశ్వరరావు, బీడీకే.రత్నం, షేక్ లాల్ మహమ్మద్, మచ్చా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## సమరయోధులపై ఛాయాచిత్ర ప్రదర్శన


రైల్వే స్టేషన్ ఆవరణలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ఆగస్టు 30 వరకు మేరా మిట్టీ.. మేరా దేశ్ (నా మట్టి – నా దేశం) ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(సీబీసీ) ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా ప్రముఖ తెలుగు స్వాతంత్య్ర సమరయోధుల ఛాయాచిత్ర ప్రదర్శన(ఫొటో ఎగ్జిబిషన్)లు ఏర్పాటు చేస్తోంది. ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు మూడు రోజుల పాటు కొత్తగూడెం రైల్వే స్టేషన్ (భద్రాచలంరోడ్) ఆవరణలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. ఈ ఫొటో ఎగ్జిబిషన్ బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.రాంబాబు, కొత్తగూడెం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి తదితరులు హాజరు కానున్నారని క్షేత్ర ప్రచార అధికారి కోటేశ్వర్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

## పథకాలు వినియోగించుకునేలా అవగాహన


సేంద్రియ ఎరువు తయారీ పరిశీలిస్తున్న సీఈఓ

ముదిగొండ: ప్రభుత్వ పథకాలను గ్రామాల ప్రజలు సక్రమంగా వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు సూచించారు. మండలంలోని పండ్రేగుపల్లి, ఖానాపురం, వెంకటాపురంల్లో మంగళవారం పర్యటించిన ఆయన వననర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్లు, పల్లె ప్రకృతివనాలు, వైకుంఠ ధామాలను పరిశీలించారు. సెగ్రిగేషన్ షెడ్లల్లో సేంద్రియ ఎరువు తయారీని పరిశీలించి సూచనలు చేశారు. అలాగే, వైకుంఠధామాల్లో వసతులు సమకూర్చాలని, రహదారుల పక్కన నాటిన మొక్కలను సంరక్షించాలని చెప్పారు. డీఎల్‌పీఓ పుల్లారావు, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎంపీఓ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సెకండ్ ఏఎన్‌ఎంల సమ్మె


కలెక్టరేట్ ఎదుట నిరసనలో సెకండ్ ఏఎన్‌ఎంలు


సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న బీజేపీ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో భాగంగా కాంటాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిపై పదిహేనేళ్లుగా పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో ఏఐటీయూసీ ఆధ్వర్యాన చేపట్టిన సమ్మె మంగళవారం ఏడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ సమీపాన ధర్నా నిర్వహించారు. సెకండ్ ఏఎన్‌ఎంల యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తోట రామాంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకృష్ణ మాట్లాడుతూ కోవిడ్ సంక్షేమ సమయంలో ప్రాణాలను లెక్కచేయకుండా విధులు నిర్వర్తించిన ఏఎన్‌ఎంల సర్వీస్‌ను క్రమబద్ధీకరించి ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాగా, బీజేపీ గోవా ఎమ్మెల్యే ప్రేమేంద్ర శెట్టి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ తదితరులు సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. అనంతరం ఏఎన్‌ఎంలు ధర్నా చౌక్ నుండి కలెక్టరేట్ ఎదుటకు చేరుకొని బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు వనిజ, విజయకుమారి, నాగమణి, సునీత, ధనలక్ష్మి, నరసమ్మ, శైలజ, కృష్ణవేణి, సునీత, రాజ్యలక్ష్మి, హేమలత, విజయమ్మ, శేషమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణ సర్వేను అడ్డుకున్న రైతులు

టేకులపల్లి: వలిగొండ నుంచి వయా మహబూబాబాద్, ఇల్లెందు మీదుగా కొత్తగూడెం (ఇల్లెందు క్రాస్ రోడ్డు) వరకు 930పీ హైవే రోడ్డుకు సంబంధించి టేకులపల్లి మండలంలోని తొమ్మిదోమైలుతండా నుంచి బొమ్మనపల్లి వరకు రోడ్డు వెంట వ్యాపారులు, ఇళ్ల యజమానులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంతలోనే సులానగర్ నుంచి సీతారాంపురం స్టేజీ మధ్యలో టోల్‌గేట్ నిర్మాణానికి భూసేకరణ కోసం మంగళవారం ఉద్యోగులు వచ్చారు. టోల్‌గేట్ కోసం సుమారు 16 ఎకరాల భూమి అవసరం పడుతుండటంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యవసాయ భూములను రైతులు కోల్పోవాల్సి ఉంటుంది. దీంతో దశాబ్దాలుగా సాగు చేసు కుంటున్న భూముల్లో టోల్‌గేట్ నిర్మాణం ఏమిటని ప్రశ్నిస్తూ రైతులు సర్వేని అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కొండపల్లి కృష్ణవేణి చేరుకున్నారు. టోల్‌గేట్ వల్ల తమ జీవనాధారమైన వ్యవసాయ భూములను కోల్పోవాల్సి వస్తోందని, టోల్‌గేట్‌ను వేరేచోటకు మార్చాలని రైతులు రాస మల్ల నర్సయ్య, వెంకటేశ్, రాందాస్, లక్ష్మి, శివలాల్, రాకేశ్, ఉపేంద్ర, రాంకోటయ్య, ముత్తయ్య, పాపారావు, కమల తదితరులు తహసీల్దార్‌కు విన్నవించారు. అయితే, నేషనల్ హైవే, టోల్‌గేట్ డిజైన్ ఎప్పుడో సిద్ధమైనందున భూ సేకరణ తప్పనిసరి అని ఆమె తెలిపారు. సర్వే జరిగాక అభ్యంతరాలుంటే తెలపాలని చెప్పగా రైతులు ఒప్పుకోలేదు. ఎమ్మెల్యే, ఎంపీలను కలిసి సమస్య చెప్పుకుంటామని, గడువు ఇవ్వాలని కోరడంతో రెండు రోజులు గడువిచ్చి ఉద్యోగులు వెళ్లిపోయారు. సర్వేలో ఆర్ఐ రత్తయ్య, సర్వేయర్ కార్తీక్, ఎన్‌హెచ్ సిబ్బంది కార్తీక్ పాల్గొన్నారు.

## లైంగిక వేధింపుల కేసు నమోదు

సత్తుపల్లి: కళాశాలకు వచ్చివెళ్తున్న యువతిని లైంగికంగా వేధించిన ఆటోడ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటకు చెందిన ఓ యువతి సత్తుపల్లిలో చదువుకుంటోంది. ఆమె రోజుమాదిరిగానే మంగళవారం కళాశాలకు వెళ్తున్న క్రమంలో ఆటోడ్రైవర్ ఉదయ్ దుర్భాషలాడుతూ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆయనపై కేసు నమోదు చేసినట్లు సత్తుపల్లి పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


ఘటనాస్థలంలో కారు, ద్విచక్రవాహనం

సత్తుపల్లిటౌన్: రాంగ్‌రూట్‌లో వచ్చిన కారును ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. పెనుబల్లి మండలం చిన్నమ్మగూడెంకు చెందిన రాయిని కృష్ణప్రసాద్, వల్లపరపు నాగ ఉదయ్ స్థానిక వాటర్‌ప్లాంట్‌లో పని చేస్తున్నారు. వీరు ద్విచక్రవాహనంపై సత్తుపల్లికి వస్తుండగా పట్టణ శివారు జ్యోతినిలయం సమీపాన రాంగ్‌రూట్‌లో ఎదురుగా వచ్చిన కారును ఢీకొన్నారు. ఈ ఘటనలో ద్విచక్రవాహనం వెనకాల కూర్చున్న కృష్ణప్రసాద్ ఎగిరి కారును దాటి రోడ్డు అవల పడడంతో తలకు తీవ్ర గాయలయ్యాయి. అలాగే, ఉదయ్ కూడా గాయపడడంతో స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో కృష్ణప్రసాద్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

### ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన అంబులెన్స్


ఘటనాస్థలిలో అంబులెన్స్, బైక్

ఖమ్మంరూరల్: మండలంలోని పాన్నేకల్ వద్ద ద్విచక్ర వాహనాన్ని అంబులెన్స్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కూసుమంచికి చెందిన సీతారాములు, పాలేరుకు చెందిన మల్సూర్ మంగళవారం ద్విచక్రవాహనంపై ఖమ్మం వెళ్తున్నారు. పాన్నేకల్ వద్ద హైదరాబాద్ నుండి ఖమ్మంకు మృతదేహాన్ని తీసుకెళ్తున్న అంబులెన్స్ అతివేగంగా వచ్చి వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరూ రోడ్డుపై ఎగిరి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

### ఉద్యోగిని మెడలో గొలుసు చోరీ


సీసీ టీవీ పుటేజీలో గుర్తించిన నిందితుడి ఫొటో

వైరా: ఉద్యోగ బాధ్యతలు ముగించుకుని ఇంటికి వెళ్తున్న మహిళ మెడలో నుంచి ఓ యువకుడు బంగారు గొలుసు లాక్కెళ్లాడు. పోలీసులు తెలిపిన వివరాలు... వైరా బాలాజీ టవర్స్‌లో ఉంటూ పీహెచ్‌సీలో సీహెచ్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న ఉదయలక్ష్మి మంగళవారం మధ్యాహ్నం భోజనం నిమిత్తం ఇంటికి వెళ్తోంది. మార్గమధ్యలో ద్విచక్రవాహనంపై వచ్చిన యువకుడు ఆమె మెడలో ఉన్న రూ.2.50లక్షల విలువైన నాలుగున్నర తులాల బంగారు నాన్‌తాడు లాక్కుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు సీసీ టీవీ పుటేజీలు పరిశీలించగా నిందితుడి ఫొటో లభించింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మేడా ప్రసాద్ తెలిపారు.

### మైనర్‌ను వివాహమాడిన వివాహితుడు?

కామేపల్లి(కారేపల్లి): మాయమాటలు చెప్పి బాలికను అప్పటికే పెళ్లి అయిన వ్యక్తి వివాహం చేసుకున్న ఘటన వెలుగు చూసింది. మండలంలోని ముస్సేబ్ బంజర గ్రామం భవాని అమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి వివాహం జరగగా, మంగళవారం బయటకు తెలిసింది. టేకులపల్లికి చెందిన మధు బాలికకు మాయమాటలు చెప్పి ఆలయానికి తీసుకొచ్చి పెళ్లి చేసుకున్నాడని ఆమె కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. అయితే, ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఇకనైనా విచారణ జరపాలని వారు కోరారు.

# 'మార్గదర్శి'లో చేరాం.. మోసపోయాం!

▶ మొదటి పేజీ తరువాయి

మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే మూడు కేసుల్లో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై సీఐడీ కేసులను నమోదు చేసి బ్రాంచి మేనేజర్లను అరెస్టు చేసింది. మరోవైపు రాష్ట్రంలో నలుమూలల నుంచి మార్గదర్శి చందాదారులు పెద్ద ఎత్తున సీఐడీకి ఫిర్యాదులు చేస్తున్నారు. ఒక్కో చందాదారుడిది ఒక్కో వ్యథ!

### మూడు రోజుల్లో 300కిపైగా ఫిర్యాదులు

మోసపోయిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు ఫిర్యాదు చేసేందుకు సీఐడీ విభాగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. చందాదారులు ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేకంగా వాట్సాప్ నంబరు ( 9493174065 ) అందుబాటులోకి తెచ్చింది. దీంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మార్గదర్శి చందాదారులు పెద్ద సంఖ్యలో సీఐడీకి ఫిర్యాదు చేస్తున్నారు. వాట్సాప్ నంబర్ అందుబాటులోకి రాక ముందు సీఐడీకి దాదాపు వందకుపైగా ఫిర్యాదులు రాగా ఇప్పుడు మూడు రోజుల్లోనే మూడు వందల మందికి పైగా చందాదారులు ఫిర్యాదు చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. చందాదారులు తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తుండటంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ మోసాల చిట్టా అంతకంతకూ పెరుగుతోంది.

### చందాదారుల సొమ్ము సొంతానికి... మార్గదర్శి దివాళా అంచుకు

కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ రామోజీరావు పాల్పడిన ఆర్థిక అక్రమాలతో చందాదారులు నిండా మోసపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుల సొమ్మును రామోజీరావు నిబంధనలకు విరుద్ధంగా తమ సొంత వ్యాపార సంస్థలైన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్‌లలో పెట్టుబడిగా పెట్టారు. మరికొన్ని నిధులను మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులుగా తరలించేశారు. దాదాపు 2 వేలకుపైగా ఉన్న చిట్టీ గ్రూపుల చందాదారులు చెల్లించే చందా మొత్తంలో కొంత మొత్తాన్ని అటూ ఇటూ రొటేషన్ చేస్తూ దశాబ్దాలుగా మోసం చేస్తూ వచ్చారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాలు బయటపడటంతో 2022 నవంబరు నుంచి కొత్త చిట్టీలు నిలిచిపోయాయి. మరోవైపు భారీగా చందాదారుల సొమ్మును రామోజీ తమ పేరిట స్థిర, చరాస్తులుగా మార్చేశారు. దీంతో ప్రసుత్తం చిట్టీ గ్రూపుల్లో ఉన్న దాదాపు 50 వేల మంది చందాదారులకు ప్రైజ్‌మనీని చెల్లించలేక మార్గదర్శి చిట్‌ఫండ్స్ చేతులెత్తేసింది. రాష్ట్రంలోని 37 బ్రాంచీల పరిధిలో దాదాపు 1,300 మంది చందాదారులకు 9 నెలలుగా ప్రైజ్ మనీ చెల్లించడం లేదని సమాచారం. గత 9 నెలల్లో రూ.1,620 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయని సీఐడీ అధికారులు గుర్తించినట్టు తెలిసింది. మరోవైపు రశీదు రూపంలో సేకరించిన అక్రమ డిపాజిట్ల మొత్తాన్ని కూడా కాల పరిమితి ముగిసినా చెల్లించడం లేదు. వెరసి దాదాపు రూ.2 వేల కోట్ల వరకు మార్గదర్శి చిట్ ఫండ్స్ బకాయి పడిందని సీఐడీ అధికారుల సోదాల్లో వెల్లడైనట్లు సమాచారం.




### సీఐడీ సత్వర స్పందన

చందాదారుల ఫిర్యాదుపై సీఐడీ విభాగం సత్వరం స్పందిస్తోంది. ఫిర్యాదులో వాస్తవాలు ఉన్నాయని నిర్ధారణ కాగానే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతోంది. ఇప్పటికే మూడు కేసుల్లో మార్గదర్శి బ్రాంచి మేనేజర్లను అరెస్టు చేసింది. 'ఘోస్ట్' చందాదారుడి పేరిట భారీ అక్రమ దందాకు పాల్పడిన కేసులో చీరాల మార్గదర్శి బ్రాంచి మేనేజర్‌కు న్యాయస్థానం రిమాండ్ విధించింది.

### సీఐడీకి మార్గదర్శి చందాదారుల ఫిర్యాదుల్లో కొన్ని

- విజయనగరంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుడు ఒకరు మొత్తం రూ.6 లక్షలు విలువైన నాలుగు చిట్టీ గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నారు. ఆయన చిట్టీ పాట పాడి రెండు ఎల్ఐసీ బాండ్లను ష్యూరిటీగా సమర్పించారు. రూ.5 లక్షలు, రూ.2 లక్షలు విలువైన రెండు బాండ్లను ష్యూరిటీగా ఇచ్చారు. ఆ చిట్టీ గ్రూపుల కాలపరిమితి ముగిసి నెలలు గడుస్తున్నా ఆయనకు ఎల్ఐసీ బాండ్లను తిరిగి ఇవ్వడంలేదు. దీనిపై సంబంధిత బ్రాంచి మేనేజర్‌ను ఎన్నిసార్లు కలిసినా అరణ్య రోదనగానే మారింది.
- విశాఖపట్నంలో ఒక చందాదారుడు రూ.40 లక్షల చిట్టీ గ్రూపులో సభ్యుడిగా చేరారు. 20 నెలలు వాయిదాలు చెల్లించిన తరువాత రూ.8 లక్షల నష్టానికి అంటే రూ.32 లక్షలకు చిట్టీ పాడారు. కానీ ఏడాదిన్నర అవుతున్నా ఇంత వరకు ఆయనకు చిట్టీపాట మొత్తం చెల్లించడం లేదు. దీనిపై బ్రాంచి మేనేజర్ సరైన సమాధానం చెప్పడం లేదు. ఎందుకంటే ఆ చిట్టీగ్రూపులో పెద్ద సంఖ్యలో నకిలీ చందాదారులు ఉన్నట్టు తెలిసింది. ఆ వాయిదాల ను మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యం చెల్లించడం లేదని చందాదారుడికి తెలిసింది. దీనిపై బ్రాంచి మేనేజర్‌ను ప్రశ్నించగా.. నీకు దిక్కున్న చోట చెప్పుకో, చిట్టీ మొత్తం ఇవ్వలేమని చెప్పడంతో చందాదారుడు నిర్ఘాంతపోయాడు.
- బాపట్లలో రూ.5 లక్షల చిట్టీ గ్రూపులో ఒకరు సభ్యుడిగా చేరారు. కొన్నినెలలు పాటు రూ.40 వేలు వాయిదాలు చెల్లించిన తరువాత ఆయన గ్రూప్ నుంచి వైదొలిగారు. ఆయన స్థానంలో మరొకరిని చందాదారుడిగా చేర్చారు. ప్రత్యామ్నాయ చందాదారుడిని చేర్చుకున్న తరువాత వైదొలగిన చందాదారునికి అప్పటికే చెల్లించిన వాయిదాల మొత్తాన్ని తిరిగి చెల్లించాలి. కానీ ఆ మొత్తం వెనక్కి ఇవ్వడం లేదు. దీనిపై బ్రాంచి మేనేజర్‌ను ప్రశ్నించగా చందాదారుడే తిరిగి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు రూ.25 వేలు చెల్లించాలని దబాయిస్తున్నారు.
- వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఒకరు నాలుగు చిట్ గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నారు. ఆయన చందా వాయిదా చెల్లించడం ఒక్క రోజు ఆలస్యమైనా రోజుకు రూ.500 చొప్పున జరిమానా వసూలు చేశారు. ఆ చందాదారుడు ఓ చిట్టీ గ్రూపులో పాట పాడి మూడు నెలలు దాటినా ప్రైజ్‌మనీ ఇవ్వడం లేదు. నిబంధనల మేరకు ష్యూరిటీలు సమర్పించినా ఆమోదించడం లేదు. దీనిపై సంబంధిత బ్రాంచి మేనేజర్‌ను ప్రశ్నించగా కంపెనీలో ప్రస్తుతం డబ్బులు లేవని అనధికారికంగా చెప్పడంతో చందాదారుడు నిర్ఘాంతపోయారు.
- విశాఖలో మరో చందాదారుడు రూ.5 లక్షలు చిట్ గ్రూపులో చేరి 38 నెలలు సక్రమంగా వాయిదాలు చెల్లించారు. తన కుమారుడి చదువు కోసం చిట్టీ పాడేందుకు వెళ్లగా ఆయన పాడేసి డబ్బులు తీసేసుకున్నట్టు రికార్డుల్లో కనిపించింది. ఆయన పేరుతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యమే పాట పాడేసి డబ్బులు తీసేసుకున్నట్టు తెలిసింది.

### అదో విష వలయం..!

- మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ చందాదారులను పక్కా పన్నాగంతో అష్టదిగ్బంధనం చేస్తోంది. వారిని శాశ్వత రుణగ్రహీతలుగా మార్చేస్తూ వారి సంపాదననే కాకుండా ఆస్తులను కూడా కాజేస్తోంది. కొందరు చందాదారులను అనధికారికంగా పలు చిట్టీ గ్రూపుల్లో సభ్యులుగా చేరుస్తోంది. ఆ విషవలయం నుంచి తప్పించుకోవడం చందాదారుల తరం కావడం లేదు. ఓ బాధితుడు సీఐడీకి ఫిర్యాదు చేయడంతో మార్గదర్శి అక్రమాల బాగోతం బయటపడింది.
- ఓ చందాదారుడు మొత్తం రూ.4.72 కోట్ల విలువైన చిట్టీ గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నారు. ఆయన రూ.3.33 కోట్ల విలువకు చిట్టీ పాటలు పాడారు. అంటే ఆయనకు రూ.3.33 కోట్లు చిట్టీ పాటల మొత్తం (ప్రైజ్‌మనీ)గా రావాలి. కానీ ఆయనకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ చేతిలో పెట్టింది ఎంతో తెలుసా?
- కేవలం రూ.23లక్షలు. నివ్వెరపోయినచ ఆయన ఇదేమిటని ప్రశ్నిస్తే.. ఆ చందాదారుడికి తెలియకుండా ఆయన్ను ఎందరో చందాదారులకు ష్యూరిటీదారుడిగా నమోదు చేసేశారు. గతంలో ఆయనతో ఖాళీ కాగితాలపై తీసుకున్న సంతకాలతోపాటు మరికొన్ని సంతకాలను ఫోర్జరీ చేసి ఇరికించారు.
- ఆయన 65 చిట్టీ గ్రూపుల్లో సభ్యుడిగా చేరితే మార్గదర్శి రికార్డుల్లో మాత్రం 90 గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నట్లు నమోదు చేశారు. అంటే ఆయన సభ్యుడిగా చేరని 25 చిట్టీ గ్రూపులకు కూడా బకాయి ఉన్నట్టుగా చూపిస్తూ ప్రైజ్‌మనీలో కోత విధించారు. దీనిపై ఆ చందాదారుడు సీఐడీకి ఫిర్యాదు చేశారు.

### ఇప్పటికే నమోదైన 3 కేసులివీ...

- సూళ్లూరుపేటకు చెందిన సుబ్రహ్మణ్యానికి తెలియకుండా ఆయన్ను చీరాలలో చందాదారుడిగా చేర్చారు. బుక్ అడ్జస్ట్‌మెంట్ల ద్వారా ఆయన చందా చెల్లించినట్టు కనికట్టు చేశారు. ఆయన పేరిట ప్రతి నెల డివిడెండ్‌తోపాటు ఒక నెల ప్రైజ్‌మనీ మొత్తాన్ని కూడా మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ ఖాతాలో వేసుకుంది. అంటే ఒక్క రూపాయి కూడా చెల్లించకుండానే డివిడెండ్లు, ప్రైజ్‌మనీ కొల్లగొట్టి ఇతర చందాదారుల ప్రయోజనాలకు విఘాతం కలిగించింది. తమ ఆధార్ కార్డును దుర్వినియోగంచేయడంతోపాటు తమకు తెలియకుండా చందాదారుడిగా చేర్చడంపై బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు చీరాల పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం మార్గదర్శి చీరాల శాఖ మేనేజర్ సురేంద్రను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు.
- అనకాపల్లికి చెందిన బి.వెంకటేశ్వరరావు నెలకు రూ.10 వేలు చొప్పున చందా చెల్లిస్తూ చిట్టీ గ్రూపులో చేరారు. 50 నెలల చందాలు చెల్లించిన తరువాత రూ.4,61,989కు చిట్టీ పాట పాడారు. ఆయన ఎన్నిసార్లు చిట్‌ఫండ్స్ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రైజ్‌మనీ ఇవ్వలేదు. ఎట్టకేలకు ఆయనకు రూ.20 మాత్రమే వస్తుందని చెప్పారు. మిగిలిన మొత్తాన్ని ఆయన ష్యూరిటీ ఇచ్చిన చిట్టీల్లో సర్దుబాటు చేసినట్టు చూపారు. అసలు తాను ఎవరికీ ష్యూరిటీ ఇవ్వలేదని ఆయన మొత్తుకున్నా బ్రాంచి మేనేజర్ వినిపించుకోలేదు. ఆయన సంతకాలు ఫోర్జరీ చేసిన పత్రాలను చూపించి బెదిరించారు. ఆ కాపీలు ఇచ్చేందుకు ససేమిరా అన్నారు. వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.
- కోరుకొండ విజయ్‌కుమార్ అనే చందాదారుడు మార్గదర్శి చిట్‌ఫండ్స్ రాజమహేంద్రవరం బ్రాంచిలో రూ.5 లక్షల చిట్టీ గ్రూపులో చేరారు. కొన్ని వాయిదాలు చెల్లించిన తరువాత 2020 జూన్‌లో రూ.3 లక్షలకు చిట్టీ పాట పాడారు. కానీ ఆయనకు ప్రైజ్‌మనీ ఇచ్చేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్ నిరాకరించారు. విజయ్‌కుమార్ తన స్నేహితుడు మల్లికార్జునరావుకు 2019లో ష్యూరిటీ ఇచ్చారని, ఆ స్నేహితుడు వాయిదాలు చెల్లించడం లేదు కాబట్టి ప్రైజ్‌మనీ ఇవ్వలేమని చెప్పారు. నిజానికి మల్లికార్జునరావు చిట్టీ గడువు అప్పటికే తీరిపోయింది. తనను మార్గదర్శి యాజమాన్యం మోసం చేసిందని విజయ్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

# లోకేశ్‌తో నాకు ప్రాణహాని

### ఇదే నా మరణ వాంగ్మూలం

- నాపై పరువు నష్టం దావా అందుకే వేశారు
- మంగళగిరి కోర్టుకు వెళ్లి వచ్చే సమయంలో హతమార్చాలని కుట్ర పన్నారు
- నేను చనిపోతే దానికి కారణం లోకేశే
- కంతేరులో హెరిటేజ్ పేరిట భూములు కొన్నది వాస్తవం కాదా?
- లోకేశ్‌కు తెలీకుండానే ఆయన తల్లి, భార్య భూములు కొన్నారా?
- వాళ్ల కుటుంబ సభ్యుల ఆస్తులతో లోకేశ్‌కు సంబంధం లేదా?
- నిత్యం బూతులు మాట్లాడే లోకేశ్‌పై నేను పరువునష్టం దావా వేస్తే 20 ఏళ్లు జైల్లో ఉండాలి
- ఏపీలోని నా ఆస్తి మొత్తం పేదలకు ఇచ్చేస్తా.. రాజధాని రైతులు స్టే వెనక్కి తీసుకోవాలి
- మీడియాతో పోసాని కృష్ణమురళి

సాక్షి, అమరావతి : టీడీపీ నేత నారా లోకేశ్ నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర, టీవీ, నాటక రంగాభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి తీవ్ర ఆరోపణ చేశారు. అందుకోసమే తనపై పురునష్టం దావా వేశారని.. ఈ కేసులో మంగళగిరి కోర్టుకు వెళ్లివచ్చే సమయంలో తనను హత్య చేసేందుకు కుట్ర పన్నారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను చనిపోతే దానికి లోకేశే కారణమని ఇదే తన మరణ వాంగ్మూలంగా భావించాలన్నారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేస్తానని మంగళవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. పోసాని ఇంకా ఏమన్నారంటే..

గతంలో లోకేశ్ నన్ను పార్టీలోకి రావాలని కోరారు. నేను నిబద్ధత కలిగిన నాయకుల వెంటే ఉంటానంటూ తిరస్కరించా. పైగా వారి అక్రమాలను ఎప్పటికప్పుడు నిలదీస్తున్నాను. అందుకే వాళ్లు నాపై కక్షగట్టారు. నేను ఎప్పుడో కంతేరులో లోకేశ్ భూములు కొన్నారని చెప్పానట. దానిని పట్టుకుని నాపై రూ.4 కోట్లకు పరువు నష్టం దావా వేశారు. అంతేకాదు.. రెండేళ్ల జైలుశిక్ష కూడా వేయిస్తారట. కంతేరులో హెరిటేజ్ పేరిట భూములు కొన్నది వాస్తవం కాదా? లోకేశ్ భూములు దోచేశారు.. కబ్జా చేశారనలేదే నేను. కొన్నారనే చెప్పాను. మీ కుటుంబ సభ్యులు కొంటే నీకు సంబంధం లేదా? మీ తల్లి, భార్య పేరు మీద ఉన్న ఆస్తులు ఎవరికి లోకేశ్?

### పవన్ వ్యాఖ్యలు మర్చిపోయారా?

అల్‌ఖైదా అంటే లాడెన్ గుర్తొచ్చినట్లు.. హెరిటేజ్ అంటేనే చంద్రబాబు గుర్తొస్తారు. నిత్యం బూతులతో జపంచేసే లోకేశ్‌పై తాను పురువు నష్టం కేసువేస్తే 20 ఏళ్లు జైలులో ఉండాల్సి ఉంటుంది. గతంలో దళితులు, ముఖ్యమంత్రి జగన్‌ను, పోలీసు అధికారులను దుర్భాషలాడిన లోకేశ్ వీడియోలను, విదేశీ మహిళలతో అర్ధనగ్నంగా దిగిన ఫొటోలను మీడియా ఎదుట పోసాని ప్రదర్శించారు. గతంలోనే లోకేశ్ బతుకును పవన్ రోడ్డున పడేశారు. ప్రతి నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్ల కుంభకోణం చేశారంటూ పవన్ చేసిన వ్యాఖ్యలు మర్చిపోయారా? సమాజంలో బూతులు మాట్లాడేవాళ్ల కంటే బూతుపనులు చేసే లోకేశ్ లాంటి వ్యక్తులతోనే ఎక్కువ ప్రమాదం.

### ఏపీలోని నా ఆస్తి మొత్తం ఇచ్చేస్తా..

చంద్రబాబుకు వ్యవస్థలను మేనేజ్ చేసే సత్తా ఉంది. అందుకే 16 కేసుల్లో స్టేలు తెచ్చుకున్నాడు. పుంగనూరులో పోలీసులపైనే దాడులు చేయించారు. నేనెంత బక్కవాడిని. నాలుగు పోట్లు వేస్తే నేను అవుట్. లోకేశ్ ఏంచేసినా కాపాడటానికి చంద్రబాబు ఉన్నారు. లోకేశ్ కంటే నాకు విశ్వసనీయత ఎక్కువ ఉంది.. అంతేగాని, అమ్ముడుపోయే వాడిని కాదు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా గెలవొచ్చు.. కమ్మ కులమే గెలవాలనుకోవడం దుర్మార్గం. ఎవరు గెలిచినా ప్రజలకు ఎంత మంచి చేస్తున్నారో చూడాలే తప్ప కులం దురాభిమానంలో పడకూడదు. రాజధానిలో ఐదు శాతం భూములు పేదలకు ఇవ్వాలని చట్టంలో ఉన్నప్పటికీ చంద్రబాబు దానిని తుంగలో తొక్కారు. కొంతమందికి కులం పిచ్చి ఎక్కించి నన్ను తిట్టిస్తున్నారు.



రాజధానిలో పేదలకు సెంటు భూమి ఇవ్వడంలో తప్పేంటని నేను ప్రశ్నిస్తే.. ఓ కమ్మ రైతు పెదకాకానిలో నాకున్న 16 ఎకరాలు ఇవ్వమంటూ బూతులు తిట్టాడు. అసలు నాకు అక్కడ భూమేలేదు. ఐదారు ఇళ్ల స్థలాలు, రెండు పెంకుటిళ్లు ఉన్నాయి. జగ్గయ్యపేట దగ్గర 30 ఏళ్ల కింద కొన్న కొంత భూమి ఉంది. మా నాన్న డబ్బులేక ఆత్మహత్య చేసుకున్నారు. నేను సినిమాల్లోకి వెళ్లిన తర్వాతే సంపాదించుకున్నా. అయినా, ఏపీలోని నా ఆస్తి మొత్తం పేద ప్రజలకు ఇచ్చేస్తా.. రాజధాని రైతులకు మానవత్వం ఉంటే పేదలకు సెంటు భూమి ఇవ్వండి. కోర్టు కేసులను వెనక్కితీసుకోండి.

### రాజధాని భూముల్లో త్యాగాల్లేవు..

రాజధాని భూముల్లో వ్యాపారం తప్ప త్యాగాల్లేవు. రాజధాని ప్రకటన కంటే ఆరు నెలల ముందే రామోజీరావు, చంద్రబాబు ఫిల్మ్‌సిటీలో కూర్చుని భూముల కొనుగోలుపై చర్చించుకున్నారు. వైఎస్సార్ రూ.11వేల కోట్ల రైతు రుణమాఫీ చేస్తే అందులో తమ కులం వాళ్లు కూడా హాయిగా లబ్ధిపొందారు.. ఇప్పుడు పేదలకు తమ భూములు ఇవ్వొద్దని వారు చెప్పడం సిగ్గుచేటు.

---

జిల్లా వార్తలు

## నిత్యాన్నదానానికి రూ.50వేల విరాళం



దాతలకు రశీదు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి ఖమ్మానికి చెందిన భక్తులు మంగళవారం విరాళం అందజేశారు. ఖమ్మం వీడీవోస్ కాలనీకి చెందిన కొర్లకుంట కిశోర్–ఉమ దంపతులు రూ.50,116 ఆలయ అధికారులకు వితరణగా అందజేయగా వారు రశీదు అందజేసి పూజలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ సాయిబాబ, ఉద్యోగులు పాల్గొన్నారు.

## 10 నుంచి జన సేవాదళ్ శిక్షణ శిబిరం




మాట్లాడుతున్న భాగం హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ అనుబంధ జనసేవాదళ్ జాతీయస్థాయి శిక్షణా కార్యక్రమం సెప్టెంబర్ 10 నుంచి 18 వరకు ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు తెలిపారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జన సేవాదళ్ శిక్షణా శిబిరానికి దేశంలోని 20 రాష్ట్రాల నుంచి యువకులు హాజరవుతారని తెలిపారు. ప్రజా సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటు జనసేవాదళ్‌కు సంబంధించిన శిక్షణను 10 రోజుల పాటు నిర్వహించనున్నామని చెప్పారు. సమావేశంలో సీపీఐ నాయకులు మహ్మద్ మౌలానా, సిద్దినేని కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 24న విద్యుత్ కార్మికుల ధర్నా

ఖమ్మంవ్యవసాయం: సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24న హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌మ్యాన్డ్, పీస్ రేట్ కార్మికులు, జేఎల్ఎంల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో చేయనున్న ధర్నాకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

# నిర్వీర్యమవుతున్న విద్యావ్యవస్థ

- పాలకుల విధానాలతోనే ఈ పరిస్థితి
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కొత్తగూడెంఅర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరుతో విద్యావ్యవస్థ నిర్వీర్యమవుతోందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో డీఈఓలు లేక... మండలాల్లో ఎంఈఓలను నియమించకపోవడంతో పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడిందని తెలిపారు. కొత్తగూడెంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లోని ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలని, అప్పటి వరకు విద్యావలంటీర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ట్రెజరీల్లో ఆమోదం పొంది ఈ- కుబేర్‌లో పెండింగ్ బిల్లులన్నీ తక్షణమే విడుదల చేయాలని, పీఆర్సీ కమిటీని నియమించడమే కాక నివేదిక వచ్చే వరకు మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. అంతేకాక సీపీఎస్ రద్దు చేసి 2004 సెప్టెంబర్‌కు ముందే విడుదలైన నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంకా విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం ఎస్టీటీ ఇసంపల్లి కొండయ్య సంస్మరణ సభలో పాల్గొన్న నర్సిరెడ్డి.. ఆయన కుటుంబానికి టీఎస్ యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి నుండి మంజూరైన రూ.6లక్షల చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావా రవి, జిల్లా అధ్యక్షుడు బి.కిషోర్‌సింగ్‌తో పాటు రాజశేఖర రెడ్డి, లక్ష్మారెడ్డి, బి.రాజు, ఎస్.కృష్ణ, వి.వరలక్ష్మి, ఎస్. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెం అర్బన్ : సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

### కళాశాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

వైరా: వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వీరభద్రం అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన అధ్యాపకులు, విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాల అభివృద్ధికి తన నిధుల నుంచి రూ.23 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో పనులు త్వరగా మొదలుపెట్టాలని సూచించిన ఆయన మరిన్ని నిధుల కేటాయింపునకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కాగా, కళాశాలలో ప్రవేశాల సంఖ్య పెంచి మెరుగైన విద్యనందించాలని అధ్యాపకులకు సూచించారు. అధ్యాపకులు జి.అనిల్, పి.శ్రీనివాసరావు, ఉమా సుందరి, జి.శ్రీనివాసరావు, కె.సురేష్, శ్రీకాంత్, రోషన్, వెంకటముత్యం, ఈశ్వరీరావు, మధు, కవిత, సుధాకర్, బాపూరావు పాల్గొన్నారు.

# రైతాంగానికి అండగా నిలుస్తాం

నాబార్డు సీజీఎం సుశీల

తిరుమలాయపాలెం: దేశానికి వెన్నెముకగా నిలుస్తున్న రైతులకు అన్నిరకాలుగా అండగా నిలుస్తున్నామని నాబార్డ్ తెలంగాణ రాష్ట్ర చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) చింతాల సుశీల తెలిపారు. తిరుమలాయపాలెం మండలం బచ్చోడులో రైతు ఉత్పత్తిదారుల సంఘం గోదాం, ఉత్పత్తిదారుల కేంద్రాలను మంగళవారం ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. ప్రైవేట్ గోదాంలు, ఎరువుల షాపులను నియంత్రించేలా రైతు ఉత్పత్తి సంఘాలు పనిచేస్తేనే అన్నదాతలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. సంఘాల ద్వారా అమ్మకాలు, కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో నాబార్డ్ జిల్లా ఏజీఎం సుశీల్‌కుమార్, ఏట సీతారాంరెడ్డి, ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ మోటపోతుల శ్రీనివాస్‌తో పాటు హన్మంతరావు, లలిత, నాగమణి, సామా వెంకటరెడ్డి, రామయ్య, కొత్తపల్లి వెంకటరెడ్డి, మూడ్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.



దమ్మపేట: ఆయిల్‌పామ్ నర్సరీని పరిశీలిస్తున్న సీజీఎం సుశీల, అధికారులు

### దమ్మపేట మండలంలో పర్యటన

దమ్మపేట: నాబార్డ్ సీజీఎం సుశీల దమ్మపేట మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ క్షేత్రాలు, అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ, నర్సరీని పరిశీలించారు. అనంతరం సీజీఎం మాట్లాడుతూ.. రైతులు పంట మార్పిడి దిశగా ఆలోచించి పామాయిల్ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. నాబార్డ్ అధికారులు శ్వేతాసింగ్, సుజిత్, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న, ఆయిల్ ఫెడ్ మేనేజర్లు బాలకృష్ణ, కల్యాణ్, హెచ్ఓ సందీప్, విజయ్‌కుమార్, సతీశ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

### రైతులకు మేలు చేయడమే లక్ష్యం

వేంసూరు: రైతులకు మేలు చేయడమే నాబార్డు లక్ష్యమని సీజీఎం సుశీల తెలిపారు. వేంసూరులో పర్యటించిన ఆమె సహకార సంఘం ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. సొసైటీ అధ్యక్షుడు తక్కెళ్లపాటి గోపాలకృష్ణ, డీసీసీబీ సీఈఓ వీరబాబు, డైరెక్టర్లు గొర్ల సంజీవరెడ్డి, చల్లగుండ్ల కృష్ణయ్య పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

దమ్మపేట: మండలంలోని అంకంపాలెం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల పీడీ కుర్సం నాగేంద్రమ్మ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. సికింద్రాబాద్‌లో ఇటీవల ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నాగేంద్రమ్మ 100మీటర్ల పరుగుపందెంలో పాల్గొని ప్రథమస్థానంలో నిలిచి ఛండీగఢ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల ఉద్యోగులు మంగళవారం సన్మానించారు. హెచ్ఎం తోలెం వెంకటేశ్వర్లు, వార్డెన్ సౌజన్య, ఉపా ధ్యాయులు రమణ, కాంతమ్మ, రజినీ, గోపాల్‌రావు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



పీడీ నాగేంద్రమ్మను సన్మానిస్తున్న హెచ్ఎం, ఉద్యోగులు

# నెడాక్ వర్క్‌షాప్‌లో డీసీసీబీ చైర్మన్



వర్క్‌షాప్‌లో పాల్గొంటున్న బృందంలో డీసీసీబీ చైర్మన్ నాగభూషణం

బ్యాంకాక్‌లో నాలుగు రోజుల పాటు శిక్షణ

ఖమ్మంవ్యవసాయం: అంతర్జాతీయ కోఆపరేటివ్ బ్యాంక్ అసోసియేషన్ ఆధ్వర్యాన థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో 'వ్యవసాయ సహకార సంఘాల సుస్థిర అభివృద్ధి, ఆర్థికాభివృద్ధి సాధించడం'అంశంపై నెడాక్ (నెట్‌వర్క్ ఫర్ ద డెవలప్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ ఇన్ ఆసియా, పసిఫిక్) వర్క్‌షాపు నిర్వహిస్తోంది. ఈ వర్క్‌షాప్ 25వ తేదీ వరకు కొనసాగనుండగా, ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కూరాకుల నాగభూషణం పాల్గొంటున్నారు. బ్యాంకాక్‌లోని నెడాక్ ప్రధాన కార్యాలయం ఆసియా – పసిఫిక్ గ్రామీణ, వ్యవసాయ క్రెడిట్ అసోసియేషన్ సహకారంతో సుస్థిరమైన, పర్యావరణ స్పృహతో కూడిన వ్యవసాయ పద్ధతులను రూపొందించడమే ప్రధాన లక్ష్యంగా ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. నిపుణుల నేతృత్వాన ప్రదర్శనలు, పలుఅంశాలపై ప్రసంగాలు ఉంటాయి. వర్క్‌షాప్‌లో టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, ఐసీబీఏ బీమా చైర్మన్ సుబ్రహ్మణ్యం, నెడాక్ డైరెక్టర్ కృష్ణ, ప్రసన్నకుమార్‌తో పాటు ఖమ్మం డీసీసీబీ చైర్మన్‌తో పాటు నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్, వరంగల్ డీసీసీబీ చైర్మన్లు పాల్గొంటున్నారు.

# హెచ్‌ఎంల పర్యవేక్షణతో విద్యాప్రగతి

కొత్తగూడెంఅర్బన్: ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాలల్లో బోధన, అభ్యసన ప్రక్రియలను నిత్యం పర్యవేక్షించడం ద్వారా విద్యార్థుల్లో ప్రగతి సాధ్యమవుతుందని, ఉన్నతి, లక్ష్య కార్యక్రమ ఉద్దేశాలు నెరవేరతాయని రాష్ట్ర విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్, ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం డైరెక్టర్ ఎస్.శ్రీనివాసాచారి తెలిపారు. కొత్తగూడెంలో ప్రధానోపాధ్యాయులకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆరు నుంచి 9వ తరగతి వరకు విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించడానికి బోధనా అభ్యసనను మార్పు చేయాలని సూచించారు. హెచ్‌ఎంలు నిరంతరం పర్యవేక్షిస్తూనే ఉపాధ్యాయులకు సలహాలు ఇవ్వడం ద్వారా పిల్లల విద్యాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. కోర్స్ డైరెక్టర్ ఎ.నాగరాజశేఖర్, రిసోర్స్ పర్సన్లు రమ, శ్రీనివాసరావు, పద్మలత, శంకర్, ఏసీజీఈ మాధవరావు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఏడీ శ్రీనివాసాచారి

## రైతులు జాగ్రత్తలు పాటించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంటలు సాగు చేస్తున్న రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని కొత్తగూడెం కేవీకే శాస్త్రవేత్తలు సూచించారు. మూడు రోజుల పాటు తేలిక నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నందున అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. పత్తిలో రసం పీల్చే పురుగు ఉధృతి ఉన్నందున దీని నివారణకు లీటర్ నీటిలో 0.3 గ్రాముల ఫ్లోనికామిడ్ లేదా 0.25 మి.లీ. ఇమిడాక్లోప్రేడ్ కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. అలాగే, వరిలో పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులను ఎట్టి పరిస్థితుల్లో వేయొద్దని, నాటు వేసిన 25 రోజుల తర్వాత పైపాటుగా ఎకరానికి 45 కిలోల యూరియా (నత్రజని)ను బురద పదునులో మాత్రమే వెదజల్లి 48 గంటల తర్వాత పలుచగా నీరు పెట్టాలని తెలిపారు. వరినాట్లు పూర్తయ్యాక 15 నుంచి 21 రోజుల దశలో ఉన్న పంటలో గడ్డి సమస్య అధికంగా ఉంటుందని, కలుపు నివారణకు లీటర్ నీటిలో 4 మి.లీ బిస్‌పైరిబాక్ సోడియం మందు కలిపి కలుపు మొక్కలు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. ఇక వరి నాట్లు సకాలంలో వేయని రైతులు ముదురు నారు నాటాల్సి వస్తే నారు చివర్లు తుంచి కుదురుకు మొక్కల సంఖ్య 6–8 పెంచి, సిఫారసు చేసిన నత్రజనిని 25 శాతం పెంచి దమ్ములో 70 శాతం, మిగిలిన 30 శాతం అంకురం దశలో వేయాలని శాస్త్రవేత్తలు తెలిపారు.